క్లుప్తంగా

మురుగు కాల్వల నిర్వహణపై ప్రత్యేక చర్యలు

శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు



రేపల్లె రూరల్: మురుగు కాల్వల నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని మురుగు నీటి పారుదలలో ఆటంకం ఉన్న కాల్వలను గుర్తించి గురువారం నీటి తొలగింపు చర్యలు చేపట్టారు. గృహాల నుంచి, దుకాణాల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను కాల్వల్లో పడవేయరాదని చెప్పారు. అలా వేయడం వలన మురుగునీటి పారుదల సమస్య ఏర్పడుతుందన్నారు. తమ పరిసరాలతో పాటు సమీప పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా గల్పర్ వాహనాన్ని ఏర్పాటు చేసి పట్టణంలోని పలుచోట్ల మురుగునీటిని తోడించి పట్టణంలో శివారు జన సంచారం లేని ప్రదేశంలో వదిలిపెట్టారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలి



అద్దేపల్లి(భట్టిప్రోలు): జనవరి 5వ తేదీన విజయవాడలో హైందవ శంఖారావం సభను నిర్వహిస్తున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. గురువారం ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో హేమశంకరరావు మాట్లాడుతూ హిందూ దేవాలయాల రక్షణ కోసం హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు. హైందవ శంఖారావం స్టిక్కర్లు, కరపత్రాలను పంచి జన జాగరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, మహిళా కన్వీనర్ కుక్కల రాజ్యలక్ష్మి, కొణతం మురళీకృష్ణ, వేల్పూరి మాధవి, పసుపులేటి శ్రీలక్ష్మి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



అమర్తలూరు(వేమూరు): వృద్ధులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అన్నారు. వేమూరు నియోజకవర్గం అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు గ్రామంలో సీనియర్ సిటిజన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాపర్రు గ్రామానికి చెందిన కూచిపూడి తాతయ్య తల్లిదండ్రులు కూచిపూడి వెంకయ్య, రావులమ్మ జ్ఞాపకార్థం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని, ప్యాపర్రులో సీనియర్ సిటిజన్ వృద్ధాశ్రమం ద్వారా వృద్ధులను ఆదుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి మండలంలో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేసి వృద్ధులను ఆదుకోవాలని ఆయన కోరారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు వేములపల్లి శ్రీధర్, జయశ్రీ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడిపాటి శ్రీనివాసరరావు, నాయకులు ఎం.సురేష్, దోమా శ్రీహస్ తదితరులు పాల్గొన్నారు.

ఐలవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



ఐలవరం(భట్టిప్రోలు): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల (గూడవల్లి) సౌజన్యంతో గురువారం భట్టిప్రోలు మండలం ఐలవరం పద్మశాలీయ కల్యాణ మండపంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. శుక్లాలు, కంటి పొరలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు పర్యవేక్షించారు. అలాగే దివంగత పాస్టర్ మణిభూషణం విలియమ్స్ జయంతి పురస్కరించుకుని విల్లీ ఆర్మ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సౌజన్యంతో గురువారం పెదపులివర్రులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక బెరాకా బ్లెస్సింగ్స్ గ్రౌండ్ ఆవరణలో ఈ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు పర్యవేక్షించారు.

ఏఐకు పెరిగిన ప్రాధాన్యత

తెనాలి అర్బన్: నేడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాధాన్యత పెరిగిందని, దానిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. రోబో వింగ్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో స్కూలులో గురువారం ఏఐ, రోబోటిక్ వైజ్ఞానిక పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రీ సర్వే.. రైతుల భూమికి హామీ

తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు



వెల్లటూరు సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారి వేణుగోపాల్, తహసీల్దార్ శ్రీనివాసరావు



చంపాడు రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సుశీల



అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



రెవెన్యూ సదస్సులో తహసీల్దారు నాగరాజు

వెల్లటూరు(భట్టిప్రోలు): రైతుల స్వాధీనంలో ఉన్న భూమికి రీ సర్వే హామీగా ఉంటుందని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల దస్తావేజుల్లో, వారి స్వాధీనంలో ఉన్న భూమి మరొకరికి రికార్డు ఐతే రీ సర్వేలో మార్పు చేసి సమస్య పరిష్కరించనున్నట్లు తెలిపారు. భూములకు సంబంధించి యదార్థ పరిస్థితులపై ప్రతి రైతు సహకరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైన సమయంలో నోటీసులు ఇచ్చి రైతులకు న్యాయం చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి రైతు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సదస్సులో 13 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.వేణుగోపాల్, ఎంపీడీవో ఎస్ వెంకట రమణ, సర్పంచ్ బొజ్జా రవి, ఎంపీటీసీ సభ్యులు వాకా వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి రేపూడి భూషణం, ఏవో జి.మీరయ్య, దేవదాయ శాఖ మండల ఇన్‌చార్జ్ దీవి వేంకటప్లాచార్యులు, ఆర్ఐ ఫణికుమార్, వీఆర్వోలు శివరామకృష్ణ, కాశీకృష్ణ, మంద్రు జక్రయ్య, గ్రామ పెద్దలు మోటూరు పుణ్య శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సు

వేమూరు: రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు సుశీల తెలిపారు. వేమూరు మండలంలోని చంపాడు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో రైతులు 4 అర్జీలు అందజేయడం జరిగిందన్నారు. అర్జీలను పరిశీలించి రైతుల సమస్యలను పరిష్కారం చేయడం జరుగుతందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 17 అర్జీలు

రేపల్లె రూరల్: మండలంలోని పిరాట్లంక గ్రామంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పొలాలు, ఇతర స్థలాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలలో పేర్లు, నంబర్లు వంటి వాటిలో తప్పులు ఉంటే వెంటనే సరిచేయటం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. గ్రామ ప్రజలు భూ సంబంధిత సమస్యలపై 17 అర్జీలను అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 10 అర్జీలు

చుండూరు(వేమూరు): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సదస్సులో రైతులు 10 అర్జీలు అందజేశారని ఆయన తెలిపారు. పొలం సర్వే చేయాలని ఒక అర్జీ, 9 అర్జీలు రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు కోసం అందజేశారని చెప్పారు. రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

జగనన్న పుట్టినరోజున మెగా రక్తదాన శిబిరం



రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

చెరుకుపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు రేపల్లె నియోజకవర్గ స్థాయిలో ఘనంగా నిర్వహించటం జరుగుతుందని రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ తెలిపారు. గుళ్ళపల్లిలోని డాక్టర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ శనివారం జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని రేపల్లె రెడ్ క్రాస్ సహకారంతో గుళ్ళపల్లి ఈఎస్ఆర్ హాస్పిటల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమం, 12 గంటలకు జగనన్న జన్మదిన కేక్ కటింగ్, అనంతరం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో రక్తం దానం చేసేందుకు ఇప్పటికే 120 మంది పేర్లు నమోదు చేసుకున్నారని, ఇంకా ఎవరైనా రక్త దానం చేయదలిస్తే 8897150503, 8317528828 నంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు. కావున జగనన్న పుట్టినరోజు వేడుకలను నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవు

విద్యుత్ శాఖ తెనాలి ఏఈఈ చిరంజీవి



రేపల్లె రూరల్: విద్యుత్ చౌర్యానికి పాల్పడినా, సకాలంలో బిల్లులు చెల్లించకపోయినా చట్టపరమైన చర్యలు ఎదుర్కొనక తప్పదని విద్యుత్ శాఖ తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవి అన్నారు. మండలంలోని పేటేరు గ్రామంలో గురువారం విద్యుత్ తనిఖీలు నిర్వహించి అనంతరం మాట్లాడారు. డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలలో 130 మంది సిబ్బందితో 4,846 విద్యుత్ సర్వీసుల తనిఖీ నిర్వహించామన్నారు. తనిఖీలలో 196 మంది వినియోగదారులు అధిక లోడు వాడుతున్నట్లు గుర్తించామని, వీరికి రూ.7.4 లక్షలు, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇరువురికి రూ.40 వేలు అపరాధ రుసుమును విధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్.సురేష్‌బాబు, ఎస్ఎం ప్రసాద్, కె.రాజశేఖర్, బి.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

వేమూరు: మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగిందని ఎక్సైజ్ సీఐ రవి కుమార్ తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామానికి చెందిన మద్యం బెల్టు షాపు నిర్వాహకుడి వద్ద 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరుగుతుందని సీఐ రవి కుమార్ గురువారం తెలిపారు.

సుస్థిరాభివృద్ధి శిక్షణ ద్వారా సుపరిపాలన సాధ్యం

జెడ్పీ సీఈఓ జ్యోతిబసు

చెరుకుపల్లి: సుస్థిరాభివృద్ధి శిక్షణ ద్వారా ప్రతి గ్రామంలో సుపరిపాలన సుసాధ్యమవుతుందని జెడ్పీ సీఈఓ జ్యోతి బసు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచ్‌లకు నిర్వహించిన రెండవ బ్యాచ్ శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ మండలంలోని అధికారులను రెండు బ్యాచ్‌లగా విభజించి నిర్వహించిన ఈ శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ పంచాయతీల పరిపాలనపై పట్టు సాధించేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం నిర్దేశించిన 9 అంశాలతో కూడిన లక్ష్యాలను అమలు చేయాలని అన్నారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు ఈఓపీఆర్డీ కేజీఏ శ్రీనివాసన్, ఏపీఎం త్యాగరాజు, కావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాలేహ జుబేద్, అగన్‌వాడీ సూపర్‌వైజర్ ధన లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌బాబు నాలుగు రోజులు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాపట్ల ఈటీసీ ప్రిన్సిపాల్ వెంకటరావు, ఎంఈవోలు పులి లాజర్, టి.నవీన్‌కుమార్, సర్పంచ్‌లు, వివిద శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగుభూమిలో వరిగడ్డి దహనం చేయటం ప్రమాదకరం



గుళ్లపల్లి వద్ద పంట పొలాల్లో వరిగడ్డిని తగులబెడుతున్న దృశ్యం

చెరుకుపల్లి: రైతుల తొందరపాటు నిర్ణయాలతో పర్యావరణం కాలుష్యమవటంతో పాటు పంట పొలాల్లో భూసారం తగ్గే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చెరుకుపల్లి మండలంలో హార్వెస్టర్ ద్వారా వరి కోతలు పూర్తి చేసుకున్న రైతులు పంట పొలాల్లోనే వరి గడ్డిని తగులబెడుతున్నారు. మండలంలోని చెరుకుపల్లి, గుళ్లపల్లి, పొన్నపల్లి తదితర గ్రామాల్లో వరి కోతలు పూర్తి చేసుకున్న రైతులు మిగిలిన గడ్డికి పంట పొలాల్లోనే నిప్పుపెడుతున్నారు. దీని వల్ల ఆయా ప్రాంతాల్లో దట్టమైన పొగ ఏర్పడటంతో పాటు పొలాల్లో ఉండే విద్యుత్ వైర్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. అయితే పంట పొలాల్లో వరి గడ్డి దగ్ధం చేయటంతో పొలంలో ఉండే భూసారం నశించే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. అంతే కాకుండా సమీప పొలాల్లో కుప్పల రూపంలో ఉన్న ధాన్యంపై నిప్పు రవ్వలు పడితే పెను ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు. విషయాన్ని గ్రహించి రైతులు ఇప్పటికైనా సాగు భూమిలో వరిగడ్డికి నిప్పుపెట్టరాదని పలువురు కోరుతున్నారు.

ఓటర్ల తొలగింపుపై అధికారులతో సమావేశం



వేమూరు: వేమూరు నియోజకవర్గంలోని ఓట్లు జిల్లా స్థాయిలో ఎక్కువగా ఉన్నాయని వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారి గుంటూరు ఉమ్మడి జిల్లా పరిషత్ అధికారి జ్యోతి బసు తెలిపారు. వేమూరు మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో గురువారం అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని వేమూరు నియోజకవర్గం ఓట్లు అధికంగా ఉన్నాయని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని చనిపోయిన వారి ఓట్లు తొలగించాలి, అలాగే గ్రామాలు వదిలి వెళ్లిన వ్యక్తుల ఓట్లను విచారణ చేసి తొలగించాలని ఆయన సూచించారు. వేమూరు నియోజకవర్గంలో బూత్ లెవల్ అధికారులు గ్రామాల్లో చనిపోయిన వ్యక్తులు ఓట్లు విచారణ చేసి తొలగించాలని ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఓట్ల కన్నా వేమూరు నియోజకవర్గంలో ఓట్లు అధికంగా ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు సుశీల, డిప్యూటీ తహసీల్దారు డి.రవీంద్ర కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులు విరాళాల సేకరణ



హెచ్‌ఎం మౌలాబీ నుంచి విరాళం సేకరిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థినులు

తెనాలి అర్బన్: నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మోని వీక్‌లో భాగంగా 22 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు కొత్తపేట మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లోని ఎన్‌సీసీ విద్యార్థులు గురువారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ మాట్లాడుతూ హింసకు గురైన నిరుపేద పిల్లలను ఆదుకునేందుకు విరాళాలు సేకరించినట్లు తెలిపారు. సేకరించిన రూ.5,308 నగదును నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యునల్ హార్మోన్ సంస్థకు అందజేయనున్నట్లు చెప్పారు. విరాళాలు సేకరించిన విద్యార్థులను ఆమెతో పాటు ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, ఉపాధ్యాయులు అభినందించారు.

సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: నగర దీపికలు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలోని 2వ శానిటరీ డివిజన్‌లో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎక్కడా చెత్త కనపడకూడదని సూచించారు. శివాజీ చౌక్‌లో ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ముందుగా శానిటేషన్ కార్యాలయానికి వెళ్లి అటెండెన్స్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

ట్రాలీ ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

కొల్లూరు : ట్రాలీ ఆటో ఢీకొని ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలైన ఘటన కొల్లూరు సమీపంలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని అనంతవరంకు చెందిన అలపర్తి లాభాను తన ద్విచక్ర వాహనంపై గురువారం రేపల్లె వైపు వెళుతున్నాడు. రేపల్లె వైపు నుంచి కూరగాయలు అన్‌లోడ్ చేసి వస్తున్న ట్రాలీ ఆటో స్థానిక గ్యాస్ గోడౌన్ సమీపంలోని మలుపు వద్ద అతివేగంగా దూసుకువచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో లాభాను కుడికాలు పూర్తిగా విరిగిపోయింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా క్షతగాత్రుణ్ని తెనాలి వైద్యశాలకు తరలించారు.

30న సర్వసభ్య సమావేశం

కొల్లిపర: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 30న ఎంపీపీ పద్మావతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండలంలోని అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు.

ఏకగ్రీవంగా టీఎంసీఏ నూతన కార్యవర్గ ఎన్నిక

తెనాలి రూరల్: ది తెనాలి మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఘంటా నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కొత్తమాసు శ్యామ్‌ప్రసాద్, కార్యదర్శిగా డాక్టర్ కె. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా డాక్టర్ జి. కోటేశ్వరప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ కె. శివరామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక బోస్ రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో జరిగిన ఎన్నికలకు అధికారులుగా డాక్టర్ వి. శేషగిరిరావు, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ ఎం.వి. సత్యనారాయణ వ్యవహరించారు.

విద్యుత్ బిల్లుల దహనం



తెనాలి అర్బన్: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం తెనాలి శాఖ ఆధ్వర్యంలో గురువారం రాత్రి సుందరయ్య కాలనీలో బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించి విద్యుత్ బిల్లులను పెంచిందని ఆరోపించారు. ప్రజల్లో దీనిపై చైతన్యం తెచ్చేందుకు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వెంటనే ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.భావన్నారాయణ, కొల్లిపర బాబూప్రసాద్, కె.రవికుమార్, పి.యేసోబు పాల్గొన్నారు.

ఆధునిక యంత్రం.. రైతు తంత్రం

- హ్యాండ్ పుష్ సీడర్ ద్వారా చకచకా మొక్కజొన్న, జొన్న నాట్లు
- రైతులకు తక్కువ ఖర్చు
- ఒకరు, ఇద్దరు కూలీలతో పని పూర్తి



హ్యాండ్ పుష్ సీడర్ యంత్రం



హ్యాండ్ పుష్ సీడర్ ద్వారా మొక్కజొన్న విత్తుతున్న రైతులు

కొల్లిపర: కాలం మారుతున్న కొద్దీ రైతుల కోసం మార్కెట్లో ఆధునిక యంత్రాలు వస్తూనే ఉన్నాయి. సాగులో పెట్టుబడులతో సతమతమవుతున్న రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం మొక్కజొన్న , జొన్న సాగు చేయాలంటే కూలీలతో విత్తనాలను నాటించాల్సి ఉంది. ఎకరానికి ట్రాక్టర్ ద్వారా మొక్కజొన్నకు బెజ్జాలు వేయటానికి రూ.1000, విత్తనాలను నాటడానికి రూ.1300, జొన్నకి రూ. 1400 కూలీలు తీసుకుంటున్నారు.దీంతో ఎకరానికి రూ. 2500 నుంచి రూ. 3000 ఖర్చు అవుతుంది. దీనికి గింజలు ఖర్చు అదనం కావడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా మార్కెట్లోకి హ్యాండ్ పుష్ సీడర్ అనే నూతన యంత్రం వచ్చింది. దానికి ఉన్న పెట్టెలో మొక్కజొన్న విత్తనాలను పోసి పొలంలో ముందుగా ఏర్పాటు చేసిన లైన్ ప్రకారం ఒక వ్యక్తి తోసుకుంటూ వెళ్లాలి. యంత్రానికి ఉన్న సన్నని ఇనుప గొట్టం ద్వారా నేలలో రంధ్రం పడి అందులో విత్తనాలు పడతాయి. ఇలా ఇద్దరు లేదా ఒక్కరూ కలసి యంత్రం ద్వారా ఎకరం రెండు, మూడు గంటల సమయంలోనే జొన్న, మొక్క జొన్న విత్తనాలను నాటుతున్నారు. రైతు యంత్రాన్ని అద్దెకు తీసుకుని, వ్యక్తి ఒక రోజు కూలీ రూ.700 వరకు ఇచ్చి విత్తనాలు విత్తుకోవచ్చు. యంత్రం ఉన్న వారు ఇద్దరు వ్యక్తులను పెట్టుకుంటే ఎకరానికి రూ.1400 తీసుకుని విత్తనాలు నాటుతున్నారు. రోజుకు ఇద్దరు వ్యక్తులు కలసి మూడు ఎకరాలల్లో గింజలు నాటవచ్చు. మండలంలో ప్రస్తుతం కొల్లిపరలో రైతులు ఈ యంత్రాల ద్వారా మెట్ట, మాగాణి పొలాల్లో మొక్కజొన్న, జొన్నను నాటు తున్నారు. మార్కెట్‌లో యంత్రం ధర రూ.7వేల వరకు ఉంది.

పీడితుల అభ్యున్నతికి రాజీలేని పోరు

దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం ప్రథమ వర్ధంతి సభలో వక్తల నివాళి



దళిత ఘోష పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చల్లపల్లి స్వరూపరాణి తదితరులు

కొల్లిపర(తెనాలి): పీడితుల అభ్యున్నతికి రాజీలేని పోరుతో పాటు వారి అభ్యున్నతి కోసం జీవితమంతా కృషిచేసిన ఆర్గానిక్ ఇంటలెక్చువల్ కనపర్తి ఏసు రత్నం మృతి ఉద్యమానికి తీరనిలోటని ప్రముఖ రచయిత్రి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. ఏసురత్నం వంటి మేధావుల అవసరం నేడు దళిత ఉద్యమానికి ఎంతగానో ఉందన్నారు. దళిత ఉద్యమనేత కొల్లిపర ఏసురత్నం ప్రథమ వర్ధంతి సభను గురువారం ఆయన స్వస్థలమైన కొల్లిపరలో నిర్వహించారు. 'అరసం' నేత కనపర్తి బెన్‌హర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. 'కార్డ్' డైరెక్టర్ డాక్టర్ ఎం.స్వర్ణలతాదేవి మాట్లాడుతూ కమ్యూనిస్టుగా ఉద్యమ జీవితం ప్రారంభించిన ఏసురత్నం, దళిత ఉద్యమకారుడిగా పోరాటం, అధ్యయనం రెండుకళ్లుగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని, అనుసరణీయమని చెప్పారు. సభలో వివిధ రంగాల ప్రముఖులు, దళిత మేధావులు ఏసురత్నంతో తమకు గల అనుబంధాన్ని, ఉద్యమకారుడిగా ఆయన పోరాటపటిమను స్మరించుకున్నారు. ఇదే సభలో డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారి రాసిన దీర్ఘకవిత 'దళిత ఘోష'ను డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి ఆవిష్కరించారు. వీసీకే పార్టీ నేత ఎస్‌జే విద్యాసాగర్, దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, 'భారత్ బచావో' నాయకుడు వేము సమత, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, అంబేడ్కరైట్ యండ్రపాటి అశోక్‌కుమార్, ఏఎన్‌యూ అంబేడ్కర్ చైర్ డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, సంగీతరావు మాట్లాడారు. తొలుత ఏసురత్నం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

నేడు, రేపు మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు

తెనాలి అర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని మెప్మా విభాగం ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం సహాయ సంఘ సభ్యులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, పిండి వంటలను అమ్మకాలు జరపనున్నట్లు పేర్కొన్నారు. మహిళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నెలలో రెండు రోజులు మున్సిపల్ కార్యాలయం ముందు దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ వస్తువులను కొనుగోలు చేసి మహిళలకు సహకరించాలని ఆయన కోరారు.

అమిత్‌షాపై కఠిన చర్యలు తీసుకోవాలి

తెనాలి అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక నాయకులు అక్కిదాసు కిరణ్‌కుమార్, యాతాటి అనిల్, బండ్లమూడి నాని, ఉన్నవ సల్మాన్, అక్కిదాసు బాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం దళితులను చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మంత్రివర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలని డిమాండ్ చేశారు. దళిత జాతికి ఆయన క్షమాపణ చెప్పాలని కోరారు.